# మళ్ళీ అమరావతి కథలు

## సత్యంశంకరమంచి

అఖండంగా ప్రవహించే కృష్ణానది గుడికి కొంచెం ఎగువన సుడిగుండంగామారుతుంది. పలకల రాళ్ళ మధ్య నుంచి మెలికలు తిరిగి, కోసురాళ్ళసందున సుళ్ళు తిరిగి మహా వేగంతో పారే ఆ సుడిగుండంలో ఈదటం తెలిసినవాళ్ళకి గొప్ప సరదా.

చింతచెట్లపైన కృష్ణలో దిగితే బారలెయ్యక్కరలేదు, కాలు ఆడించక్కరలేదు. కన్ను మూసి తెరిచేంతలో సుడిగుండంలో కొచ్చేస్తాము. అంత వేగం, ఆ సుడిగుండంలోని సుళ్ళలో ఇరుక్కుని మనమూ సుళ్ళు తిరిగి తిరిగి చట్టుదాటేంతలో రెండు బారలేస్తే వొడ్డుకొస్తాము. సుళ్ళు మళ్ళీ మళ్ళీ తిప్పేస్తుంటే తిరిగి తిరిగి అందులో ఈతలు కొడ్తారు అక్కడి జనమంతా.

మాఘమాసం నాటికి సుడిగుండం ఎండిపోతోంది. పలకరాళ్ళమీద, కోసు రాళ్ళమీద, చట్టమీద పిడకలు కొడ్తారు. కృష్ణయితే దూరంగా వెళ్ళిపోయిందిగాని ఆ రాళ్ళమధ్య నిలచిన నీళ్ళింకా వున్నాయి. ఆ నిలవ నీళ్ళలో చిన్న చిన్న చేపలు, వాటి పక్కనే ఓ ఎలికలోళ్ళ జంట; బాచిగాడు, సింగి.

నల్లగా చింతబరికల్లా వున్నారు బాచిగాడు, సింగి. వొంచిన తల ఎత్తలేదు. నడుం నిటారుగా నిలపలేదు. పొద్దుట్నుంచీ చేటలతో, జల్లెళ్ళతో ఆ నిలవ నీళ్ళు జల్లిస్తున్నారు. రాళ్ళు ఏరుతున్నారు. వొళ్ళంతా కళ్ళు చేసుకుని ఇసుక గాలిస్తున్నారు.

ఉదయం గుళ్ళో తీర్థం బిందె తెచ్చే వేళతో మొదలయి పడమట సూర్యుడు వాటారేదాకా అలా మురుగునీళ్ళు జల్లిస్తున్నారు. నెత్తి మాడుతున్నా పని ఆగలేదు. దాహమేస్తున్నా పని ఆగలేదు. కడుపులో పేగులు కావు కావు మంటున్నా పని ఆగలేదు. చింత చెట్టు కొమ్మన చిరుగుల చీరలో వేళ్ళాడుతున్న బాచిగాడి ఆర్నెల్ల కొడుకు పాలకోసం కెవ్వుమని ఏడుస్తున్నా పని ఆగలేదు.

సూర్యుడు నడి నెత్తికొచ్చి పెట పెటలాడిస్తున్న వేళ సింగి పలకలరాయి పక్కన రెండు రాళ్ళు మోపుజేసి నాలుగు చితుకు లేరుకొచ్చి గంజి కాచింది ఆ మంటలోనే. జల్లింపులో దొరికిన చేప పిల్లల్ని ఉప్పు కారంతో వంజుకొందుకు వేయించింది.

"ఇంక సాల్లేవయ్యా దొర! లేచిరా గంజి తాగుదువు" అని పిలిచింది సింగి.

బాచిగాడు జల్లెడ పక్కకి పెట్టి వొళ్ళు విరుచుకున్నాడు. ఇనప చువ్వలాటి శరీరాన్ని కావిడిబద్దలా అటూ ఇటూ వంచాడు. జల్లించిన రాళ్ళ గుట్టవైపు చూశాడు. లోతుగా వున్న నిలవ నీళ్ళవైపు చూశాడు. ఆ మురుగు నీట్లో అతనికి ధవరాసులు కన్పిస్తున్నాయి. విలువైన రాళ్ళ కోసం ఆ వేట.

గంజి సమంగా తాగాడో లేదో జల్లెడ, చేట తీసుకొని నీళ్ళ దగ్గరకొచ్చాడు. అతడి వెంటే సింగి వడిచొచ్చింది.

దొడ్లో వెండి కంచం కడగడానికొచ్చిన సూర్యకాంతం వడి ఎండలో జల్లింపులో మునిగివున్న వాళ్ళిద్దర్నీ చూసింది. సూర్యకాంతానికి తళుక్కున మెరుపులా ఆలోచన వచ్చింది. గబగబా ఇంట్లోకొచ్చి నిబ్బరంగా చుట్టకాలుస్తున్న భూమయ్యతో గుసగుసగా చెప్పింది. క్షణాలమీద ఎలిక లోళ్ళకి కబురెల్లింది.

వరండా చివర భయం భయంగా వచ్చి నుంచున్నారు బాచిగాడు, సింగి. భూమయ్యగారి పాదాలు తాకడానికి పనికిరారు కాబట్టి "దణ్ణాలు దొరా" అని నేల తాకారు. ఆ నేల తాకిన వంపుకి సింగి చంకన గుడ్డలో వేళ్ళాడుతున్న పసిగుడ్డు కెవ్వుమన్నాడు. చటుక్కున వాడి నోరు నొక్కింది సింగి.

భూమయ్య పెదవి విప్పకుండా వాళ్ళిద్దర్నీ చూస్తున్నాడు. ఆ చూపుకు వణికిపోతున్నారు ఎలికలోళ్ళు. పగపట్టిన తాచుపాము ఎదురుగా వచ్చి నుంచుని కాలు కాటేద్దామా, వేలు కాటేద్దామా అని చూస్తున్నట్టుంది భూమయ్య చూపు.



## సుడిగుండంలో ముక్కుపుడక

"దొంగ నాయాళ్ళలారా!" అని దీవనతో మొదలెట్టి "ఆ గుంటలో మా ఇంటోళ్ళ ముక్కుపుడక దొరికిందంటగదరా" అన్నాడు భూమయ్య.

మాడుమీద కట్టె పేడుతో కొట్టినట్టయింది బాచిగాడికి, సింగికి. ఇద్దరూ ముఖాలు ముఖాలు చూసుకున్నారు. "లేద్దొరా" అంటూ నేలమీద కూలబడ్డారు. "దొరా! లేద్దొరా" గిలగిల లాడ్తున్నట్టు అంటున్నారు.

"దొంగనాయాళ్ళలారా! ఏడుపు లాపండెయ్! ఆ ముక్కుపుడక మా ఇంటోళ్ళకి పుట్టింటోరు పెట్టింది. కిష్ట తగ్గుముఖం పట్టినప్పుడు ఆ గుంటలో పడింది. ఆ పుడక లేకపోతే దాని ముఖం కళ తగ్గిపోయింది. మనిషి సగమైంది. తెల్లారేపరికి అది తేకపోయారో...అన్నాడు భూమయ్య. ఇంక చెప్పక్కర్లేదు. అది తేకపోతే భూమయ్య చూపు తమని, తమ గుడిసెని, తమ వంశాన్నే బుగ్గి చేసేస్తుందని వాళ్ళకు తెలుసు.

"పొండెహె" అన్నాడు భూమయ్య.

కందిపుల్లల్లా లేచి నుంచున్నారు ఎలికలోళ్ళు. చొప్పదంట్లలా వంగిపోయి తూలు కుంటూ ముందుకు నడిచారు. నోరు విప్పితే దవడలు పేలిపోతాయి. కాదంటే కాళ్ళూ చేతులూ విరుగుతాయి. పసిగుడ్డుకి పాలివ్వటం మర్చిపోయి బెక్కుతోంది సింగి. రెండు క్షణాల్లో సాఫయిపోయిన బాచిగాడు "ఎందుకే ఏడుపు ఆ జల్లెడిటియ్యి" అని నీళ్ళ వైపు కెళ్ళాడు.



సంజె వేళయింది-జల్లింపు ఆపలేదు బాచిగాడు. గుడ్డి చిమ్నీ పెట్టుకుని సూర్యకాంతం ముక్కుపుడక కోసం కుళ్ళు నీళ్ళు గాలిస్తున్నాడు. చిమ్మ చీకట్లో జర జర ఇసుక తోడ్తున్నాడు. అర్ధరాత్రి గుడ్లగూబల అరుపుకు తోడుగా చేటతో చెరుగుతున్నాడు. కప్పల బెకబెకలు, కీచురాళ్ళ అరుపులమధ్య కమ్నుకానని కాళరాత్రిన కాలభైరవుడిలా వున్నాడు బాచిగాడు. నీళ్ళదుగంటుతున్నాయి. ముక్కుపుడక దొరక లేదు. ఇసక తరిగిపోతోంది. ముక్కుపుడక దొరకలేదు. చీకటెల్లిపోతే తమ ప్రాణాలు పోతాయి. జల్లించి, జల్లించి, చెరిగి చెరిగి చేతులు చచ్చుపడగా సొమ్మసిల్లి పడిపోతున్న బాచిగాడికి తెలతెలవారుతున్న సమయాన బురదలో కూరుకున్న ముక్కుపుడక తళుక్కున మెరిసింది.

"ఓల్దేవుడోవ్" అంటూ ప్రపంచాన్ని జయించినవాడిలా గావుకేక పెట్టాడు బాచిగాడు.


కోసురాయిపక్క జోగుతున్న సింగికి గుండెవిసిపోగా లగెత్తుకొచ్చింది. బాచిగాడు నల్లటి చక్కిళ్ళమీద కన్నీటి ధారలు. సింగి భళ్ళు భళ్ళున నవ్వుతూ ఏడ్చింది ముక్కుపుడకని చూచి.

సూర్యుడు పది బారల పైకి సాగాడు. ముక్కు పుడక భూమయ్య గారికి ఇచ్చి వచ్చిన బాచిగాణ్ణి చూసి సింగి అడిగింది "ఏదన్నా బహుమానం ఇచ్చారా?"

మన కెందుకే బవుమానాలు?

"పోనీ పప్పన్నం?"

"మంచిరాయి దొరకనీయే! మనవే పెడ్దాం అందరికీ పప్పన్నాలు" అంటూ చాట తీసుకొని నిలవ నీళ్ళదగ్గర కెళ్ళాడు.




ఆ మాట చక్రవర్తి హొందాలో అన్నాడు బాచిగాడు. ఆ దరిద్ర చక్రవర్తి కలవాళ్ళ ముక్కుపుడకలు వెతికి ఇచ్చి తను రాళ్ళకోసం దేవుళ్ళాడుతున్నాడు. బాచిగాడేకాదు, అతని తాతలు తండ్రుల కాలం నుంచి ఆ వంశం రాళ్ళు జల్లిస్తూనే వుంది రతనాల కోసం.

ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

కాపీలు కొట్టే విద్యార్థులు, ఇన్‌విజిలేటర్ల పై కత్తులు దూసి బెదిరించే స్టూడెంట్స్, బారులు, సినిమా హాల్స్, కాఫీ హోటళ్ళలో తింటూ, తాగుతూ కాలక్షేపం చేసే యువతరానికి గుణపాఠం 'మా మంచి మేస్టారు'.

పిల్లలు క్రమశిక్షణతో
నెల్ల శుభంబులను బొంది యొసగుదురనుచున్
దల్లియు దండ్రియునై వా
రెల్లర భావించి తీర్చి నెన్నికకెక్కన్ —
అరుగో ఆయనే 'మా మంచి మేస్టారు'

పర్యవేక్షకులు లేకుండా పరీక్షలు నడపడం సాధ్యమా? విద్యాప్రమాణాలు పెరిగి, ఉత్తమ విద్యార్థులు తయారావాలంటే 'కొత్త' బాట కావాలి. ఆ కొత్త బాట వేసిన 'మా మంచి మేస్టారు' గురించి చదవండి! చదివి ఆలోచించండి!

దేశాభివృద్ధికి కావలసింది ఉద్దండ పండితులు మాత్రమే కాదు కాదు కాదు - ఒళ్ళు దాచుకోకుండా నిజాయితీతో శ్రమించే చిత్తశుద్ధికల 'మా మంచి మేస్టర్లు' కావాలి.

డాక్టర్ కొత్త రవీంద్రబాబు సరికొత్త సీరియల్
త్వరలో - అతిత్వరలో - మహాత్వరలో వస్తోంది!